క్లుప్తంగా

ఎంపీడీవోగా మోహన్‌మురళి బాధ్యతల స్వీకరణ



శ్రీరంగరాజపురం: ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణయ్య బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇన్‌చార్జ్‌ ఎంపీడీవోగా మోహన్‌ మురళి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు సద్దికూళ్లపల్లెలో పశువుల పండుగ

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట పంచాయతీ సద్దికూళ్లపల్లెలో ఆదివారం పశువుల పండుగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గ్రామాల్లో చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పంచాయతీలోని గ్రామాల్లో శనివారం సర్పంచ్‌ లిల్లీ, వైస్‌ ఎంపీపీ పుష్ప, పంచాయతీ కార్యదర్శి సుధ కలిసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని స్థానికులకు అవగాహన కల్పించారు. రాత్రిళ్లు దోమతెరలు వాడాలన్నారు. దగ్గు, జ్వరం, జలుబు వచ్చిన వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

వెదురుకుప్పం: మండలంలోని వెలుగు కార్యాలయంలో శనివారం ఓటు హక్కు వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్‌ శివయ్య వీవీ ప్యాట్‌ల వినియోగం, ఓటు హక్కు నమోదు, యాప్‌ డౌన్‌లోడ్‌ తదితర అంశాలను వివరించారు.

ఓటును సద్వినియోగం చేసుకోండి



ఓటు వేయడంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్‌

కార్వేటినగరం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ విజయులురెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం ఓటు హక్కు… మనందరి బాధ్యత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. దాన్ని సక్రమమైన పద్ధతిలో వినియోగించుకుని రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఓటు వేసే ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్‌ వెల్ఫేర్‌ అధికారి హేమలత, అధ్యాపకులు ధనుంజయరెడ్డి, హరిబాబు, కార్తీక్‌, గోపీకృష్ణ, జోగిప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా గోపి



విజయపురం (నగరి): విజయపురం మండల వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ సమన్వయ కమిటీలను అధిష్టానం శనివారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండల పార్టీ అధ్యక్షుడిగా గోపి, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణమనాయుడు, మహా, జనరల్‌ సెక్రటరీలుగా శాంతి, మునిలక్ష్మి, ప్రకాష్‌, కార్తీక్‌, కార్యదర్శులుగా నాగరాజు, మునిరత్నం, రమేష్‌, చెంగయ్య, పాండియన్‌, ప్రకాష్‌, కుప్పయ్య, ఈ జీ బాబు, జాయింట్‌ సెక్రటరీలుగా రాజా, అంగముత్తు, దేవి, తమిళ్‌సెల్వి, జ్యోతి, రాజా, విజయన్‌, రాజ్‌కుమార్‌ను నియమించారు.

మున్సిపాలిటీ అధ్యక్షుడిగా అయ్యప్పన్‌



నగరి: వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులుగా సత్రవాడకు చెందిన బీఆర్వీ అయ్యప్పన్‌ నియమితులయ్యారు. శనివారం అధిష్టానం ప్రకటించిన కార్యవర్గంలో ఆయనకు మరో మారు అధ్యక్ష పదవి దక్కింది. ఉపాధ్యక్షులుగా ఈవీ కన్నియప్పన్‌, ఎంఆర్‌ భూపాలన్‌, ప్రధాన కార్యదర్శులుగా ఏపీఎస్‌ నాగరాజ్‌, పీఎస్‌ఎస్‌ మోహన్‌రాజ్‌, ఎస్‌ఎస్‌ దేశప్పన్‌, కార్యదర్శులుగా ఎస్‌ఎన్‌ చంద్రన్‌, ఎస్పీ జయచంద్రన్‌, పీజీ నందగోపాల్‌, పీఆర్‌ కళైసెల్వన్‌, షణ్ముగం, సోము, భూపాల్‌, శివకుమార్‌రెడ్డి, దేశప్పన్‌, గోవిందరాజులురెడ్డి, ఉపకార్యదర్శులుగా నీలకంఠన్‌, విజయకుమార్‌, కేసీ రవి, ఎంవి అరుల్‌, తంగరాజ్‌, ఎంఎన్‌ మణి నియమితులయ్యారు.

నగరి సిగలో మరో మణిహారం

- మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్యాలయం మంజూరు
- తీరిన నగరి ప్రజల కోరిక

నగరి: నగరి పట్టణ హోదా ప్రమాణాలు పెంచడంలో రాష్ట్ర, పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలన్న తపన, దాన్ని సఫలీకృతం చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకెళుతున్నారు. జిల్లాల పునర్విభజనలో నగరి, విజయపురం, నింద్ర మండలాలు చిత్తూరు జిల్లాకు పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాకు చేరిపోయాయి. దీంతో నియోజకవర్గ అభివృద్ధి రెండు జిల్లాల పరంగా చేపట్టాల్సిన పరిస్థితి ఎదురైంది. అన్ని మండలాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయడంలో మంత్రి విజయవంతంగా దూసుకెళుతున్నారు. నగరిని డివిజన్‌ కేంద్రంగా చేయడంతో నగరిలోనే ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం ఇప్పటికే ఏర్పాటయ్యాయి. దీంతో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందినవారు చిత్తూరుకు వెళ్లే పరిస్థితి లేకుండా భూములకు సంబంధిత వ్యవహారాలకు నగరిలోని ఆర్డీవో కార్యాలయంలోనే పరిష్కరించుకునే సదుపాయం కల్పించారు. మరోవైపు పుత్తూరులోను డీఎస్పీ కార్యాలయాన్ని కొనసాగించారు. అయితే పుత్తూరులోని మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్యాలయం తిరుపతి జిల్లాకు చేరిపోవడంతో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన వారు వాహనాలకు లైసెన్స్‌ తీసుకోవాలంటే చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చింది. ఇది వారికి చాలా కష్టతరంగా మారింది. దీంతో వారు మంత్రి ఆర్కేరోజాకు తమ సమస్యను విన్నవించుకున్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి ఆర్కేరోజా తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు. దీంతో ముఖ్యమంత్రి గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడంతో నగరి పట్టణానికి మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్యాలయం మంజూరైంది. ఈ మేరకు ప్రిన్సిపల్‌ కార్యదర్శి ప్రద్యుమ్న నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆరు మండలాలకు ప్రయోజనం

నగరితో పాటు నింద్ర, విజయపురం, కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లోని వారికి ప్రయోజనం కలిగించేలా నగరి పట్టణంలో మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్యాలయం ప్రారంభం కానుంది. ఇక డ్రైవింగ్‌ లైసెన్సులు తీసుకోదలచిన వారు చిత్తూరుకు వెళ్లాల్సిన అవసరం లేదు. అందుబాటులో నగరిలోనే లైసెన్సులు, వెహికల్‌ ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్లు పొందవచ్చు.

అడిగిన వెంటనే ఓకే చేసిన జగనన్న

ప్రజల సౌకర్యార్థం అడిగిన ప్రతి పని జగనన్న ఓకే చేయడంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలుగుతున్నానని మంత్రి ఆర్కేరోజా అన్నారు. నియోజకవర్గ హోదా ప్రమాణాలు పెంచేలా నగరిలో ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఎంవీఐ కార్యాలయం తెప్పించగలిగానన్నారు. పుత్తూరులోని డీఎస్పీ కార్యాలయాన్ని, ఎంవీఐ కార్యాలయాన్ని అలాగే కొనసాగించగలిగానన్నారు. అడిగిన వెంటనే అన్ని ప్రజా ప్రయోజన పనులకు ఓకే చెబుతున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డికి రుణపడి ఉంటామని చెప్పారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి (ఫైల్‌)

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా శంకర్‌



పుత్తూరు: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపాలిటీ పార్టీ కమిటీని నియమించారు. పుత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షుడుగా డి.శంకర్‌, ఉపాధ్యక్షులుగా ఇ.చిరంజీవి, ఏ.రత్నం, జనరల్‌ సెక్రటరీలుగా కె.భాస్కర్‌రెడ్డి, ఏ.ఎస్‌.వెంకటేశ్‌రెడ్డి, ఎన్‌.చిరంజీవి, ఎన్‌.గంగయ్యనాయుడు, ఎస్‌.నాగరాజు, కార్యదర్శులుగా కె.తాతయ్య, డీఎస్‌.వెంకటేష్‌, పి.రవి, బి.చంద్రశేఖర్‌వర్మ, జి.సెల్వరాజన్‌, ఏ.లోకనాథం(కుట్టి), కె.మునిరత్నం(కడియాల నాయుడు), పి.సునీల్‌, ఏ.సలీమ్‌, సహాయ కార్యదర్శులుగా టి.జి.శక్తివేల్‌, ఏ.శివకుమార్‌, పిఎం.కైలాసం, ఎస్‌.శివకుమార్‌, ఎం.ఎస్‌.దినేష్‌, ఏ.బాబు, షేక్‌మస్తాన్‌, ఏ.జయరామ్‌, డీ.ఎల్‌.రామన్‌, దావూద్‌జిన్నా, డి.శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయం



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: పేదవాడిని అక్కున చేర్చుకుని ఆదరాభిమానాలు చూపిస్తున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి స్పష్టం చేశారు. ఆయన శనివారం సాయంత్రం సాక్షితో మాట్లాడారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మూడు రోజులుగా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని చేపట్టిన స్కూటర్‌ ర్యాలీలు విజయవంతం కావడంపై ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ బలం, ఆర్థిక స్థోమత, పలుకుబడిలేని తనను వైఎస్సార్‌ కుటుంబంలో సభ్యుడిగా గుర్తించి ఈ స్థాయికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పేదల ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న సీఎం జగనన్న కోసం తన జీవితమంతా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇదే రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి సీఎం జగనన్నపై ప్రతిపక్షాలు చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడాలంటే ప్రతి ఒక్కరూ జగనన్నకు తోడుగా నిలవాలని కోరారు.

మీడియాపై టీడీపీ ఇన్‌చార్జి థామస్‌ మాటల దాడి

గంగాధర్‌ నెల్లూరు: టీడీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్‌ శనివారం మీడియా ప్రతినిధులపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. ఆయన శనివారం వెజ్జుపల్లిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ‘వార్తలు రాస్తేనే నేను ఎమ్మెల్యే అవుతానా.. లేకుంటే కానా, నన్ను విమర్శిస్తే సహించే వ్యక్తిని కాను. నేను హై సొసైటీ వ్యక్తిని. ఎవరినీ లెక్క చేయను. అవసరమైతే పేపర్‌ యాజమాన్యంతో చర్చించి మీ భరతం పడతాను’ అని చిందులు తొక్కారు. చంద్రబాబు రమ్మంటే వచ్చానని, ఎవరికీ సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం తనకు లేదని మండిపడ్డారు. కొంతమంది నాయకులు జోక్యం చేసుకుని అతన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. వారం క్రితం చంద్రబాబు నియోజకవర్గ పర్యటన సందర్భంగా తమకు తగిన గౌరవం, సదుపాయాలు కల్పించలేదని ప్రశ్నించినందుకు దురుసుగా ప్రవర్తించడంపై మీడియా ప్రతినిధులు విస్తుపోయారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

పుత్తూరు: మానవ అక్రమ రవాణా, కల్తీ ఆహారాన్ని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పుత్తూరు సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.సీ.రాఘవేంద్ర అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నారాయణవనం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పిల్లలకు జంక్‌ ఫుడ్‌ను అలవాటు చేయరాదని తెలిపారు. పిల్లల పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై మరింతగా ఉందన్నారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. పిల్లలకు గుడ్‌టచ్‌, బ్యాడ్‌టచ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో ఉన్నప్పుడు 100కు ఫోన్‌ చేయాలని లేకుంటే దిశా యాప్‌ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే, లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాపింగ్స్‌ పెరుగుతున్నాయని, వీటి నియంత్రణలో పోలీసులు తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌ పోటీలకు వెదురుకుప్పం విద్యార్థిని



విద్యార్థినికి సర్టిఫికెట్‌ అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

వెదురుకుప్పం: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌ పోటీలకు వెదురుకుప్పం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాయత్రి ఎంపికై నట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరులోని పీఈఎస్‌ పబ్లిక్‌ పాఠశాలలో మూడు రోజులుగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్‌ పోటీల్లో గాయత్రి ప్రదర్శించిన ప్రాజెక్ట్‌ విజయం సాధించినట్టు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌ సేవ కనుల పండుగగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

వలంటీర్ల సేవకు సత్కారం



అవార్డు అందుకున్న వలంటీర్లతో చైర్మన్‌, కమిషనర్‌, కౌన్సిలర్లు

నగరి: ఉత్తమ సేవలు అందించినందుకుగాను వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవా వజ్ర, సేవారత్న అవార్డులను మున్సిపల్‌ చైర్మన్‌ పీజీ నీలమేఘం వలంటీర్లకు అందజేశారు. మున్సిపల్‌ కమిషనర్‌ మంజునాథ్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అవార్డుల పంపిణీ జరిగింది. చింతలపట్టెడకు చెందిన వలంటీర్‌ ఎంపీ ధనంజయ్‌కు సేవా వజ్ర అవార్డు దక్కగా, ఏకాంబర కుప్పం నార్త్‌ వలంటీర్‌ అభిరామి, టీఆర్‌ కండ్రిగ వలంటీర్‌ బాలాజి, ఎంపీడీవో సచివాలయ వలంటీర్‌ ప్రకాష్‌, చింతలపట్టెడ వలంటీర్‌ దేవిరెడ్డి వయ్యారం, పుదుపేట నార్త్‌ వలంటీర్‌ పవిత్రలకు సేవా రత్న అవార్డు దక్కింది. అందరికీ అవార్డులు అందించిన చైర్మన్‌ వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, భూపాలన్‌, మోహన్‌రాజ్‌, ఇంద్రయ్య, మురుగ, కో–ఆప్షన్‌ సభ్యులు ఆనంద్‌కుమార్‌, ఎల్లప్పరెడ్డి, మేనేజర్‌ శేఖర్‌ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌ కళాశాలలో క్యాంపస్‌ సెలక్షన్స్‌



విద్యార్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

పుత్తూరు: పట్టణంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్‌ సెలెక్షన్స్‌లో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్‌ ఎస్‌.వీ.కుమార్‌ తెలిపారు. గ్రీన్‌టెక్‌ ఇండస్ట్రీస్‌ కంపెనీ వారు 40 మందిని, అప్పాసామి అసోసియేట్స్‌ కంపెనీ వారు 30 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రీన్‌టెక్‌ ప్రతినిధి నాగరాజు, అప్పాసామి ప్రతినిధులు జ్యోతీశ్వర్‌, సేతురామన్‌, కళాశాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



డీవీఆర్‌ కండ్రిగ వద్ద బోరును పరిశీలిస్తున్న ఎస్‌ఈ విజయకుమార్‌

నగరి: ప్రతి ఇంటికీ జలజీవన్‌ మిషన్‌ ద్వారా తాగునీటిని అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ కె.విజయ కుమార్‌ అన్నారు. మండలంలో శనివారం జలజీవన్‌ మిషన్‌ పథకం ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇంకనూ ప్రారంభించని పనులను స్వయం సహాయక సంఘాలకు కమ్యూనిటీ కాంట్రాక్ట్‌ సిస్టమ్‌ ద్వారా ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామ జల సంఘాన్ని ఏర్పాటుచేసి వారికి రివాల్వింగ్‌ ఫండ్‌ అందిస్తామన్నారు. గ్రామ జల సంఘం, తమ సభ్యులతో చర్చించి, వారి గ్రామ అవసరాల దృష్ట్యా కావలసిన పైప్‌లైన్‌, ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేయడం వంటి పనులను కమ్యూనిటీ కాంట్రాక్ట్‌ సిస్టమ్‌ ద్వారా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. డీవీఆర్‌ కండ్రిగలో మండల నిధుల ద్వారా వేసిన బోరును పరిశీలించిన ఆయన పైప్‌ లైన్‌ పనులను చేపట్టాలని సూచించారు. మండల అసిస్టెంట్‌ ఇంజనీర్లు, వెలుగు ఏపీఎంల ద్వారా గ్రామ జల సంఘాన్ని త్వరితగతిన ఏర్పరచి, రివాల్వింగ్‌ ఫండ్‌ జమ చేయుటకు వీలుగా ప్రతి గ్రామ జల సంఘానికి బ్యాంక్‌ ఖాతా ఓపెన్‌ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ యంఆర్‌.సతీష్‌ కుమార్‌, నగరి, విజయపురం, నింద్ర ఏఈఈలు ఆర్‌.శైలేంద్ర, కెవి.శ్రీకాంత్‌, కె.అంజేరయ్య పాల్గొన్నారు.

బాబు అరాచకాలను ఎండగట్టేందుకు ‘సిద్ధం’



పెనుమూరులో బైక్‌ ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,



గంగాధర నెల్లూరు మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్‌ ర్యాలీ

గంగాధర్‌ నెల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో ప్రజలను మోసగించిన వైనం, ఇప్పుడు మళ్లీ మోసం చేయడానికి ఇస్తున్న అబద్ధపు హామీలను ఎండగడుతూ వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, నాయకులు కదం తొక్కారు. పేదవాడి సంక్షేమానికి అడ్డుపడుతున్న చంద్రబాబును వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధమంటూ గంగాధర్‌ నెల్లూరు మండలంలో శనివారం 1500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పద్మాపురం నుంచి ఎస్‌ఎస్‌ కొండ, కాలేపల్లి, తూగుండ్రం, అంబోదరపల్లి, గంగాధర్‌ నెల్లూరు వరకు సాగింది. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్‌ బ్యూటిఫికేషన్‌ డైరెక్టర్‌ గుణశేఖర్‌ రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మునిరాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడి జీవన ప్రమాణం మెరుగుపరిచిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌ అని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న పాటలకు మాజీ ఏఎంసీ చైర్మన్‌ చిన్నమ్మ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదరం, వైస్‌ ఎంపీపీ హరిబాబు, నియోజకవర్గ యువత విభాగం అధ్యక్షుడు ఢిల్లీ కుమార్‌, జిల్లా యువజన విభాగం సంయుక్త కార్యదర్శి జగదీష్‌ బాబు డ్యాన్స్‌ చేశారు. ఎంపీపీ అనిత లోకేష్‌ రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మాజీ మండల కన్వీనర్‌ సురేంద్ర రెడ్డి, రైతు భరోసా కేంద్రం అధ్యక్షుడు బాబురెడ్డి, వేల్కూరు మాజీ సర్పంచ్‌ కుట్టి, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ వేలు మొదలియార్‌ పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

కార్వేటినగరం: చంద్రబాబు చేసిన అరాచకాలు, మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చేస్తున్న కుట్రలను ఎండగడుతూ వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు శనివారం ఎంపీపీ లత, మండల కన్వీనర్‌ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో మోస పూరిత హామీలిచ్చి మహిళలను నిలువునా వంచించిన మోసగాడు చంద్రబాబునాయుడు అని దుయ్యబట్టారు. నేడు మరోసారి మోసం చేసేందుకు తప్పుడు హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు అధికారాన్ని కట్టబెట్టాలనే ఉద్దేశంతో ఎల్లో మీడియా అసత్య కథనాలు రాస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబుకు ఓటు వేస్తే మళ్లీ కరువు తాండవిస్తుందన్నారు. జగనన్నను మళ్లీ గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవచ్చని సూచించారు. అనంతరం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం ఆర్చీ నుంచి సుమారు 1500 మోటార్‌ సైకిళ్లతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ కార్వేటినగరం, సురేంద్రనగరం, డీఎంపురం, కేఎం పురం, కొటార్వేడు, అమ్మపల్లి క్రాస్‌ నుంచి మళ్లీ కార్వేటినగరం వరకు సాగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్‌ శేఖర్‌రాజు, జేసీఎస్‌ కన్వీనర్‌ పురంధర్‌, కోఆప్షన్‌ మెంబర్‌ పట్నం ప్రభాకర్‌ రెడ్డి, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ గోపి, స్థానిక సర్పంచ్‌ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్‌ శేషాద్రి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్‌ మొదలి, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు(కార్వేటినగరం): సీఎం జగనన్నతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ విజయకుమార్‌ రెడ్డి తెలిపారు. రాప్తాడులో ఆదివారం జరిగే సిద్ధం సభకు సంఘీభావంగా శనివారం పెనుమూరు క్రాస్‌ నుంచి చిప్పార్లపల్లి వరకు సుమారు వెయ్యి మోటార్‌ సైకిళ్లతో భారీ ర్యాలీ చేశారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు, నేడు జగనన్న పాలనకు ఉన్న తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆదరించి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్మన్‌ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్‌, జిల్లా కోఆప్షన్‌ మెంబర్‌ అమీన్‌, జేసీఎస్‌ కన్వీనర్‌ హరికృష్ణ, కృష్ణారెడ్డి, లోకేష్‌రెడ్డి, ఉమాపతి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, పండరీనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరులో బైక్‌ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కార్వేటినగరంలో బైక్‌ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు